క్లుప్తంగా

27 నుంచి ఎల్లమ్మ తిరునాల

కలికిరి: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన కలికిరి గ్రామ దేవత ఎల్లమ్మ తిరునాల ఈ నెల 27వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరుగుతుందని ఆలయ ధర్మకర్త రెడ్డివారి అశోక్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ 27న శనివారం రాత్రి జాగరణ, అమ్మవారి కథాకాలక్షేపం కార్యక్రమంతో జాతర ఉత్సవం ప్రారంభమవుతుందని, 28న ఆదివారం ఉదయం తేరుపై అమ్మవారి గ్రామోత్సవం, సిద్ధపూజ, మధ్యాహ్నం నుంచి అమ్మవారికి దీలు, బోణాల సమర్పణ, రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు చాందినీ బండ్లు ఊరేగింపు, 29న సోమవారం అమ్మవారి సర్వదర్శనం, రాత్రి లంకాదహనం, పుష్పపల్లకీ ఊరేగింపు, 30న మంగళవారం పార్వేట ఉత్సవం, కల్లిపాటుతో జాతర ముగుస్తుందని తెలిపారు.

కేశాలు దానం



కేశాలు దానం చేస్తున్న విద్యార్థినులు

మదనపల్లె సిటీ: కేన్సర్ బాధితుల మోహాల్లో చిరునవ్వు చిందించడానికి హెల్పింగ్‌మైండ్స్ తలపెట్టిన హెయిర్ డొనేషన్ కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తోంది. ఇందులో భాగంగా ఆదివారం మదనపల్లెకు చెందిన కారుణ్య, మేఘన, మాధురి, శ్రావణి, శాంతిలు హెల్పింగ్‌మైండ్స్ కార్యాలయానికి వచ్చి స్వచ్ఛందంగా తమ కేశాలను అందజేశారు. నిర్వాహకురాలు అబూబకర్‌సిద్దిక్ వీరికి పూల మొక్కలను అందించి అభినందించారు. కార్యక్రమంలో హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు కిరణ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

చెడు మార్గాన్ని వీడి సన్మార్గంలో నడవాలి

కురబలకోట: ప్రతి ఒక్కరూ చెడు మార్గాన్ని వీడి సన్మార్గంలో నడుస్తూ దేవుని ప్రేమలో జీవించాలని అంగళ్లులోని సీయోను ప్రార్థన మందిరం ప్రధాన సేవకులు విక్టర్ వేదనాయకమ్, సహ పాస్టర్ శ్యామ్యుల్ పేర్కొన్నారు. ఆదివారం మందిరంలో జరిగిన ఆరాధన వాక్య పరిచర్యలో వారు మాట్లాడుతూ పదానికి ప్రపంచాన్ని మార్చే శక్తి ఉందన్నారు. దేవుని దయ కలిగిన వారు ఉన్నతంగా రాణిస్తార న్నారు. ఇందుకు సత్ప్రవర్తన ఉండాలన్నారు. దీనత్వం కలిగి దయతో నడుచుకోవాలన్నారు. ప్రతి మనిషి హృదయం దేవునికి తెలుసన్నారు. ప్రతి ఒక్కరూ వర్ధిల్లాలన్నది దేవుని సంకల్పమన్నారు. దేవునికి లోబడి జీవించేవారికి ఆయన ఆశీస్సులు ఎప్పుడూ తోడుగా ఉంటాయన్నారు. గొప్ప కార్యాలు చేస్తాడన్నారు.

జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు

వాల్మీకిపురం: జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక వాసవీ ఫంక్షన్ హాల్‌లో ఆ పార్టీ సంయుక్త కార్యదిర్శ మైఫోర్స్ మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు మైఫోర్స్ గంగాధర్ తెలిపారు. కార్యక్రమానికి హాజరైన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బెజవాడ దినేష్, చిత్తూరు జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు అమరనారాయణ, జిల్లా కార్యదర్శి అడపా రవి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ సంయుక్త కార్యదిర్శ మహేష్ మాట్లాడుతూ జనసేన పార్టీలో ప్రజలందరూ వివిధ పార్టీల నుంచి వచ్చి పెద్ద ఎత్తున చేరాలని, పార్టీ విజయం కోసం కృషి చేసే ప్రతి ఒక్క కార్యకర్తకు గుర్తింపు తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో ఆసిఫ్, ఈశ్వరయ్య, ప్రభాకర్, మహేష్, నరేష్, గణేష్,ఆది, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌పై పర్యాటకుల రద్దీ



బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై ఆదివారం పర్యాటకుల రద్దీ నెలకొంది. అన్నమయ్య, వైఎస్సార్, సత్యసాయి, అనంతపురం జిల్లాలు, కర్ణాటకకు చెందిన సందర్శకులు తరలివచ్చారు. ప్రకృతి సందర్శనా ప్రాంతాలు సందర్శకులతో కిటకిటలాడింది. అటవీప్రాంగణంలో జంతుప్రదర్శనశాల, మొసళ్ల పార్కు, వ్యూపాయింట్ల వద్ద సందర్శకులు తిలకించారు. గాలిబండపై చల్లటిగాలికి సందర్శకులు సేదతీరారు.

రెడ్డెమ్మతల్లీ..కరుణించమ్మా

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. రెడ్డెమ్మ తల్లీ కరుణించమ్మా అంటూ భక్తులు మొక్కుకొన్నారు. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయానికి వేకువజామునుంచే భక్తుల రాక మొదలైంది. మహిళలు అమ్మవారి కోనేట్లో పవిత్ర స్నానమాచరించి అమ్మవారి ఎదుట సంతాన కోసం వరపడ్డారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించారు. పలువురు ఆలయంలో అన్నదానం నిర్వహించారు.

సద్గురు సాయినాథ్ మహరాజ్‌కి జై

- భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు
- కనులపండువగా మధ్యాహ్న హారతి
- బాబాను దర్శనం కోసం క్యూలో భక్తులు
- భక్తులతో కిటకిటలాడిన బాబా మందిరాలు

'గురుపౌర్ణమి రోజు సద్గురు శ్రీ షిరిడిసాయి నాథునికి విశేషమైన రోజు. ఈ పర్వదినాన బాబాను కొలిస్తే భక్తులకు సాయినాథుని విశేష అనుగ్రహ ఆశీస్సులు లభిస్తాయని భక్తుల నమ్మకం. భక్తి శ్రద్ధలతో, ప్రగాఢ విశ్వాసంతో బాబాను పూజిస్తే, ఆర్తితో పిలిస్తే బాబా తప్పకుండా పలుకుతారని, కోరికలు ఆలకిస్తారని భక్తుల ప్రగాఢ విశ్వాసం'.


వాల్మీకిపురం : మొక్కు తీర్చుకుంటున్న మాజీ ఎమ్మెల్యే చింతల


భక్తిశ్రద్ధలతో బాబా నామస్మరణ చేస్తున్న భక్తులు

వాల్మీకిపురం: సద్గురు సాయినాథ్ మహరాజ్‌కి జై అంటూ.. భక్తుల సాయి నామస్మరణతో వాల్మీకిపురం శ్రీషిర్డీసాయి నగర్‌లో వెలసిన శ్రీ షిర్డీసాయి ఆలయం మార్మోగింది. ఆదివారం గురుపౌర్ణమిని పురస్కరించుకొని షిరిడిసాయి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. వివిధ రకాల పుష్పాలతో ఆలయాన్ని ముస్తాబు చేశారు. స్వామివారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు అర్చనలు, విశేష పూజలు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 5:30గంటలకు కాగడహారతి, 6గంటలకు స్వామివారి మూల విగ్రహానికి జలాభిషేకం, 8గంటలకు పంచామృతాభిషేకం, అనంతరం బాబాను పల్లకీసేవ నిర్వహించారు. అలాగే 12గంటలకు కనులపండువగా మధ్యాహ్న హారతి, 2గంటలకు సాయిసచ్చరిత్ర పారాయణం భక్తులను ఆకట్టుకుంది. ఉదయం నుంచే జిల్లా నలుమూలలనుంచి భక్తులు తండోపతండాలుగా వచ్చి భక్తులు బాబాను దర్శించుకున్నారు. మధ్యాహ్న సమయానికి వేలసంఖ్యలో భక్తులు బాబా దర్శనానికి తరలిరావడంతో బాబా ఆలయం కిటకిటలాడింది. భక్తుల సౌకర్యార్థం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సాయంకాలం 6గంటలకు ధూప్‌హారతి, రాత్రి 9గంటలకు శేజ్ హారతి సేవలు జరిగాయి. అలాగే శ్రీ పట్టాభిరామ స్వామి ఆలయం ఎదురుగా ఉన్న సత్యసాయి మందిరంలో బాబాకు విశేష పూజలు నిర్వహించారు. అలాగే పడమర ధర్మపథంలో వెలసిన శ్రీ కార్యసిద్ధి అభయాంజనేయస్వామి దేవాలయంలో అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పీలేరులో..

పీలేరు రూరల్ : స్థానిక షిర్డిసాయిబాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం బాబాకు అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, హారతి కార్యక్రమాలు చేపట్టారు. పీలేరు పట్టణంలోని పలువురు భక్తులు బాబాను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ఊరేగింపు రంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పట్టణ ప్రముఖులు, పలువురు భక్తులు పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం కార్యక్రమం, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేపట్టారు.

ఘనంగా గురుపౌర్ణమి

పెద్దమండ్యం: మండలంలోని పాపేపల్లె పంచాయతీలోని గుడిశవారిపల్లె బస్టాప్ వద్ద వెలసిన షిర్డి సాయిబాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేదపండితులు హోమం నిర్వహించి అనంతరం బాబాకు ప్రత్యేక అలంకరణ చేశారు. గురుపౌర్ణమి సందర్భంగా మండలంలోని కలిచెర్ల, పెద్దమండ్యం, పాపేపల్లె, గాలివీడు మండలంలోని అరవీడు, యల్లంవారిపల్లె గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. వేదపండితులు బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో వేదపండితులు మణికంఠ శర్మ, ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

బాబా ఆలయాలు భక్తులతో కిటకిట

మదనపల్లె సిటీ: గురు పూర్ణిమ పురస్కరించుకుని ఆదివారం మదనపల్లె పట్టణంలోని సాయిబాబా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక బర్మావీధిలోని సాయిబాబా ఆలయంలో స్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయంలో హోమాలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బాబునాయుడు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు. స్థానిక బైపాస్‌రోడ్డులోని సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి పురస్కరించుకుని పూజలు నిర్వహించారు. వరాల ఆంజనేయస్వామి ఆలయంలో స్వామికి వెన్నెతో అలంకరణ చేశారు. స్థానిక కోటవీధిలోని షిర్డిసాయిబాబా ఆలయం, సరస్వతి నగర్‌లోని సాయిబాబా ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలు జరిగాయి. స్థానిక దేవళంవీధిలోని సోమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి 108 కమలాలతో లక్ష్మి హోమం,గురు దక్షిణామూర్తి హోమం అర్చకులు ఫణికుమార్‌శర్మ నిర్వహించారు.మదనపల్లె మండలం పెంచుపాడులోని దత్తాత్రేయ ఆశ్రమంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

రామసముద్రంలో..

రామసముద్రం: మండల కేంద్రంలో వెలసిన సద్గురు సాయిబాబా ఆలయాల్లో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు అనిల్ ఆధ్వర్యంలో ఉదయం కాకడ హారతి, క్షీరాభిషేకం, విష్ణుసహస్రనామ పారాయణ, అలంకరణ, పూజలు , మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త లక్ష్మీపతి, ఆలయ కమిటీ సభ్యులు రామచంద్ర పలు రకాల పుష్పాలతో పల్లకీని అలంకరణ చేసి పురవీధుల్లో బాబాను ఊరేగించారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

తంబళ్లపల్లెలో..

తంబళ్లపల్లె: మండల కేంద్రంలోని కోర్టు సమీపంలో వెలసిన శేషసాయిబాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నిర్వాహకులు వెంకటేష్, సుధాకర్ ఆధ్వర్యంలో బాబాకు ప్రత్యేక అలంకరణ చేశారు. పూజలు,అభిషేకాలు నిర్వహించి భక్తులకు బాబా దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నసంతర్పణ చేశారు. అలాగే మల్లయ్య కొండపై వెలసిన శ్రీభమరాంబిక సమేత మల్లికార్జునస్వామి వేడుకల్లో భాగంగా గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. స్వామికి పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులు గిరిప్రదక్షిణ చేసి మొక్కులు తీర్చుకున్నారు.

కలకడలో..

కలకడ : మండలంలోని బాలయ్యగారిపల్లె పంచాయతీ పెండ్లిమర్రివాండ్లపల్లెలోని శ్రీగురుదత్తాత్రేయస్వామి ఆలయంలో, కె.దొడ్డిపల్లె పంచాయతీ గోపాలపురంలో వెలసిన శ్రీసాయిమందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం గురుపౌర్ణమి సందర్భంగా ఉదయం అభిషేకాలు, ప్రత్యేక అర్చనలు చేశారు.





పీలేరు: ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు, మదనపల్లె : బాబా దర్శనం కోసం క్యూలో భక్తులు, మదనపల్లె : షిర్డీ సాయిబాబాకు పూజ చేస్తున్న అర్చకులు, తంబళ్లపల్లె: ప్రత్యేక అలంకరణలో శేష సాయిబాబా

నేటి నుంచి సర్కార్ స్కూళ్లలో 'శిక్షా సప్తాహ్'

పెద్దతిప్పసముద్రం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జాతీయ నూతన విద్యా విధానం అమలై నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఆయా పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ పేరుతో వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని సమగ్ర శిక్ష ఆదేశాలు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాల్లోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 22 నుంచి 28 వరకు వారం రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించాలి. ఈ వేడుకలను విజయవంతం చేసేందుకు స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు భాగస్వాములు చేసి విజయవంతం చేయాల్సి ఉంది. 22వ తేదీన స్థానికంగా లభించే వనరులను ఆసరాగా చేసుకుని అభ్యసన సామగ్రిని తయారు చేయడం, వాటి పరిశీలన కోసం పిల్లల తల్లిదండ్రులను ఆహ్వానించడం, 23న పునాది అభ్యసన కార్యక్రమంలో భాగంగా 1వ తరగతి నుంచి భాషపై పిల్లలు మంచి నైపుణ్యం సాధించేలా చేయాలి. అలాగే గణితంలోని సంఖ్యాశాస్త్రంపై పట్టు సాధించేలా అవగాహన కల్పించడం, 24న క్రీడలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించి వారిలోని నైపుణ్యాన్ని వెలికి తీయడం, 25న భిన్నత్వంలో ఏకత్వం భావనను విద్యార్థుల్లో పెంపొందించేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలి. 26న సాంకేతిక నైపుణ్యాల దినోత్సవంలో భాగంగా విద్యలో సాంకేతికాభివృద్ధిని గుర్తించేలా చర్చలు జరపడం, 27న పర్యావరణ పరిరక్షణలో భాగంగా మిషన్ లైఫ్ యాక్టివిటీస్, న్యూట్రీషన్ డే, అమ్మకు అంకితం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, తల్లులతో మొక్కలు నాటించాలి. 28న చివరి రోజు కావడంతో ప్రజలు, పిల్లల కన్నవాళ్లతో కలసి కమిటీలను ఏర్పాటు చేయాలి. ఈ వేడుకలను మొక్కుబడిగా కాకుండా చిత్తశుద్ధితో నిర్వహించాలని విద్యాశాఖ అధికారులకు సమగ్రమైన ఆదేశాలు అందాయి. అయితే సర్కార్ స్కూళ్ల అయ్యవార్లపై , రాష్ట్ర సమగ్ర శిక్ష ఉత్తర్వుల మేరకు ఈ వేడుకల నిర్వహణపై ఎంఈఓలు, క్లస్టర్ పరిధిలో పని చేసే సీఆర్పీలు ప్రత్యేక దృష్టి సారించి కార్యక్రమాన్ని విజయవంతం చేయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బైక్ ఢీకొని తీవ్ర గాయాలు

బి.కొత్తకోట: బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొనడంతో ఒకరు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం స్థానిక కేజీబీవీ వద్ద చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ బొజ్జి నాయక్ కథనం మేరకు వివరాలు. బి.కొత్తకోట మండలం కనికలతోపుకు చెందిన రమేష్ (42) బైక్‌పై కర్ణాటకలోని గౌనిపల్లెకు వెళ్లేందుకు బి.కొత్తకోటకు వస్తున్నాడు. మదనపల్లెరోడ్డులోని కేజీబీవీ వద్దకు రాగానే బి.కొత్తకోట నుంచి మదనపల్లెకు పల్సర్ బైక్‌పై వెళ్తున్న డి.కిరణ్‌కుమార్ ఢీకొన్నాడు. దీనితో రమేష్ తీవ్రగాయాలకు గురయ్యాడు. బాధితున్ని వైద్యం కోసం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కడపకు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్‌ఐ తెలిపారు.

డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేద్దాం

- యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి
- పట్టణంలో విచ్చలవిడి గంజాయి వాడకంపై చర్యలు
- ఎమ్మెల్యే షాజహాన్‌బాషా


యాంటీ డ్రగ్స్ అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె : డ్రగ్స్, మత్తు పదార్థ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం.. సమాజాన్ని మేల్కొలుపుదాంలో భాగంగా మదనపల్లె యూత్ కరాటే అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీని ఆదివారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డ్రగ్స్, మత్తు పదార్థాల వాడకంతో పేదల జీవితాలు చిన్నాభిన్నం అవుతున్నాయన్నారు. డ్రగ్స్ రహిత సమాజంగా మార్చేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. మత్తు పదార్థాలు సేవించడంతో అనారోగ్య సమస్యలతో పాటు విలువైన జీవితం అంధకారమవుతుందని చెప్పారు. డ్రగ్స్ రహిత సమాజం నిర్మాణంలో విద్యార్థులు, యువత, ఎన్‌జీఓలు భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. యువత పాశ్చాత్య సంస్కృతిలో భాగంగా చెడు అలవాట్లు నేర్చుకుని, మత్తు పదార్థాలకు బానిసలుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రశాంతతకు, ఆహ్లాదకర వాతావరణానికి పేరుమోసిన మదనపల్లెలో ఇటీవల కాలంలో గంజాయి, డ్రగ్స్ వినియోగం అధికమవుతోందని వార్తలు వినిపిస్తున్నాయని, వీటిని అరికట్టేదిశగా పోలీస్‌శాఖ చర్యలు తీసుకోవాలన్నారు. చెడు అలవాట్లకు యువత దూరంగా ఉంటూ సమాజంలో అత్యున్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. యాంటీ డ్రగ్స్ క్యాంపెయిన్, ర్యాలీ నిర్వహిస్తున్న మదనపల్లె యూత్ కరాటే అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు డాక్టర్.ఏ.ఆర్.సురేష్‌ను అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ మైనారిటీ నాయకులు ఎస్.ఏ.మస్తాన్, రామకృష్ణ, బెల్లే ప్రసాద్, జీ.వి.నాయుడు, కౌన్సిలర్ తులసీ, ఐటీయూసీ కృష్ణమూర్తి, హాస్టల్‌వార్డెన్ వెంకటేష్, హెడ్‌కానిస్టేబుల్ రామమూర్తి, నరసింహయాదవ్, కరాటే క్లబ్ మణిసాయి, మహేశ్వర్, మిస్బా, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలు విస్తృతం చేస్తాం


మాట్లాడుతున్న లయన్స్‌క్లబ్ ఆఫ్ పీలేరు ప్లాటినమ్ నాయకులు

పీలేరు : లయన్స్‌క్లబ్ సేవలు మరింత విస్తృతం చేస్తామని నూతనంగా ఎన్నికైన లయన్స్‌క్లబ్ ఆఫ్ పీలేరు ప్లాటినమ్ అధ్యక్షుడు బి.వి. రమణారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక బీకేఆర్ రెసిడెన్సీలో లయన్స్‌క్లబ్ ఆఫ్ పీలేరు ప్లాటినమ్ నూతన కార్యవర్గాన్ని పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ బక్తవత్సలరెడ్డి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బి.వి. రమణారెడ్డి, కార్యదర్శి ఏకాంతంరెడ్డి, ట్రెజరర్‌గా శివపణీష్, ఉపాధ్యక్షులుగా రమేష్‌కుమార్‌రెడ్డి, ఎ.ఎస్. హుమయూన్, మెంబర్షిప్ చైర్‌పర్సన్ వేణుగోపాల్, సర్వీస్ చైర్‌పర్సన్ రెడ్డెప్పరెడ్డి, మార్కెటింగ్ చైర్‌పర్సన్ సురేష్‌బాబు, కోఆర్డినేటర్ శ్రీహరిరెడ్డి, అడ్మినిస్ట్రేటర్ నాగరాజు తోపాటు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సమాజ సేవా కార్యక్రమాల తోపాటు పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తామన్నారు.

171 మందికి ఉచిత వైద్యసేవలు



గుండ్రేవారిపల్లెలో సంజీవిని గ్రామీణ స్త్రీ ఆరోగ్య పరిరక్షణ వైద్యశిబిరం

కేవీపల్లె : మండలంలోని ఎంవీపల్లె పంచాయతీ గుండ్రేవారిపల్లెలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 171 మందికి వైద్యసేవలు అందించారు. ఆదివారం అరబిందో ఫార్మా ఫౌండేషన్ సౌజన్యంతో శ్రీనివాస చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ×సంజీవిని గ్రామీణ స్త్రీ ఆరోగ్య పరిరక్షణ ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోగ్రామ్ డైరెక్టర్ డాక్టర్ పి.వి. బ్రహ్మారెడ్డి, కోఆర్డినేటర్ శశికుమార్‌రెడ్డి, మాట్లాడుతూ గ్రామీణ మహిళల ఆరోగ్య పరిరక్షణ, గర్భాశయ కేన్సర్ నివారణ లక్ష్యంగా వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. శిబిరంలో 70 మంది మహిళలకు పాప్ స్మియర్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. అలాగే సాధారణ జబ్బులకు సంబంధించి 171 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ విద్య, డాక్టర్ సృజన, డాక్టర్ పూజిత, డాక్టర్ జిలాని, డాక్టర్ సమీమ్, వలంటీర్లు శ్రీనివాసులురెడ్డి, రామాంజనేయులు, షబ్బీర్, బాషా తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రిలో నాసిరకం పనులపై ఎస్ఈ ఆగ్రహం

పనులు నాణ్యతగా చేయాలని సూచన


నిర్మాణపనుల్లో నాణ్యత లేకపోవడంపై అధికారులను ప్రశ్నిస్తున్న ఎస్ఈ ఆనందరెడ్డి

మదనపల్లె : మెడికల్ కళాశాల నిర్వహణ కోసం జిల్లా ఆస్పత్రి భవనంపైన నిర్మిస్తున్న భవన నిర్మాణ పనుల్లో నాణ్యత లేకపోవడంపై, పనులు నాసిరకంగా చేయడంపై ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీఎంఎస్ఐడీసీ) సూపరింటెండెంట్ ఇంజినీర్ ఆనందరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం జిల్లా ఆస్పత్రిలో భవన నిర్మాణ పనులు ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. జరిగిన పనులన్నింటినీ పరిశీలించారు. ఈ సందర్భంగా చాలాచోట్ల గోడలు ఫినిషింగ్ లేకపోవడం, బాత్‌రూమ్ డోర్లు సరిగ్గా ఫిట్ చేయకపోవడం, ఫ్లోరింగ్ అన్‌లెవెల్ ఉండటం, పైకప్పు రేకులు సరిగ్గా అమర్చకపోవడంతో వర్షపు నీళ్లు లోనికి వస్తుండటాన్ని గమనించారు. కాంట్రాక్టర్ పనులు నాసిరకంగా చేస్తుంటే, మీ పర్యవేక్షణ ఏమైందని డీఈ కరీముల్లాను ప్రశ్నించారు. పై గదులకు వెళ్లేందుకు ఆస్పత్రి వెనుకవైపు నిర్మిస్తున్న ర్యాంపు డిజైన్‌లో మార్పులుచేసి, వాలు తగ్గించి పొడవు పెంచాలని సూచించారు. శానిటోరియం మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న కార్మికులను ఇక్కడకు తరలించడంతో అక్కడ పనులు మందకొడిగా సాగుతున్నాయని ఈఈ అరవిందాదేవి, ఎస్ఈ ఆనందరెడ్డికి దృష్టికి తేగా, గడువులోపు పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. ఆస్పత్రి భవన నిర్మాణంలోని లోపాలను తక్షణమే సరిచేసి, ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పశువుల అక్రమ రవాణాను అరికట్టాలి

వాల్మీకిపురం: రాష్ట్రంలో జరుగుతున్న పశువుల అక్రమ రవాణాను అరికట్టాలని బీజేపీ పీలేరు నియోజకవర్గ సీనియర్ నాయకుడు పులి నరేంద్ర కుమార్ రెడ్డి కోరారు. ఆదివారం స్థానిక రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పశువుల అక్రమ రవాణా అనేది తీవ్ర సమస్యగా మారిందని, వ్యవసాయ రంగానికి, పశువుల సంరక్షణకు పెద్ద హానికరమైందన్నారు. పాడి పశువులను కోబేరాలకు తరలిస్తుండడం బాధకలిగిస్తుందన్నారు. పశువుల అక్రమ రవాణాను అరికట్టి, అక్రమ రవాణాను పాల్పడుతున్న వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఉచిత కంటివైద్య శిబిరానికి స్పందన

250 మందికి కంటి పరీక్షలు


ఉచిత కంటి వైద్యశిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

మదనపల్లె : తిరుపతి శ్రీ వెంకటేశ్వర అరవింద్ కంటి ఆస్పత్రి సహకారంతో పట్టణంలోని జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆదివారం కళాశాల ఆవరణలో వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రారంభించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో జ్ఞానాంబిక కళాశాల సేవలు అభినందనీయమన్నారు. కరస్పాండెంట్ డాక్టర్ రాటకొండ గురుప్రసాద్ మాట్లాడుతూ...ఉచిత వైద్యశిబిరంలో 250 మందికి పైగా కంటి పరీక్షలు చేయించుకున్నారన్నారు. వీరికి విజన్‌టెస్ట్, కేటరాక్ట్ ఎవల్యూషన్, డయాబెటిక్ రెనోపతి, స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారన్నారు. ఇందులో 25 మంది ఆపరేషన్లకు ఎంపికయ్యారని, వీరికి తిరుపతిలో ఉచితంగా శస్త్రచికిత్స చేయిస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్.రచన, క్యాంప్ కోఆర్డినేటర్ వినోద్‌కుమార్, ప్రిన్సిపాల్ రమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ రాఘవేంద్ర పాల్గొన్నారు.

ఆషాఢంలో తగ్గిన చేనేత అమ్మకాలు

- ఆగిన చేనేత మగ్గాలు
- తగ్గిపోయిన అమ్మకాలు
- శ్రావణంపైనే ఆశలు


నేత పనులు లేక నిలిచిపోయిన మగ్గం

మదనపల్లె సిటీ: పట్టుచీరల తయారీ కేంద్రంగా మదనపల్లెలోని నీరుగట్టువారిపల్లె గుర్తింపు పొందింది. వివాహాలు, శుభకార్యాలయాలకు ఎక్కువగా ఈ ప్రాంతంలో నీరుగట్టువారిపల్లె పట్టు చీరలు వాడుతారు. ఇక్కడ సుమారు 29వేల మందికిపైగా చేనేత అనుబంధరంగంపై జీవనోపాధి పొందుతున్నారు. ఇక్కడ వ్యాపారులు పట్టణంలోని నీరుగట్టువారిపల్లెలో సుమారు 150కి పైగా షాపులు నిర్వహిస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి ఎంతో మంది వచ్చి పట్టుచీరలు కొనుగోలు చేస్తారు.అంతే కాకుండా ఇక్కడ నేసిన చీరలను నేతన్నలు బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, కంచి, ధర్మవరం వంటి మహానగరాలకు తీసుకెళ్లి అమ్ముతున్నారు. దీంతో నేతన్నలకు చేతినిండా పని దొరుకుతుంది.

ఆగిన మగ్గాలు

ఆషాఢమాసం ఈనెల 5వ తేదీన ప్రారంభమైంది. దీంతో శుభ కార్యాయాలకు బ్రేక్ పడింది. వచ్చే నెల 15న ఆషాడం ముగుస్తుంది.దీంతో వివాహాలు కూడా లేవు. దీంతో నేతన్నలు నేసిన చీరలను షాపు నిర్వాహకులు కొనుగోలు చేసి అమ్ముడుపోక స్టాకు నిల్వ ఉండిపోయాయి. దీంతో పెట్టుబడి పెట్టిన వ్యాపారులు ఆవేదన చెందుతున్నారు. వ్యాపారాలు లేకపోవడంతో ఆర్డర్లు రాకపోవడంతో నేతన్నలకు పనులు లేకపోవడంతో మగ్గాలు చాలా వరకు నిలిపివేశారు. చాలా మంది కార్మికులు కూలీ పనులకు వెళుతున్నారు. వచ్చే నెల శ్రావణ మాసం ప్రారంభం కానుండటంతో దీనిపై నేతన్నలు ఆశలు పెట్టుకున్నారు.

తాకట్టు కేంద్రం ఏర్పాటు చేయాలి

పట్టుచీరలు అమ్మకాలు లేనప్పుడు ప్రభుత్వం తాకట్టు కేంద్రం ఏర్పాటు చేయాలి.పట్టుచీరలు స్టాకు చూసి సబ్సిడీపై రుణంపై ఇవ్వాలి. అమ్మకాలు పుంజుకున్నప్పుడు నేతన్నలు చీరలు అమ్మకాలు చేసుకుంటారు. ఆపదలో ఉన్న సమయంలో నేతన్నలను ఆదుకోవాలి.

-చంద్రశేఖర్, చేనేత కార్మికుడు, మదనపల్లె